విశాలాంధ్ర
పేజి : 2
విశాఖపట్నం
శనివారం 18, జనవరి 2025

ఫిబ్రవరిలో అంతర్జాతీయ దేవాలయాల సమావేశం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఇన్ క్రెడిబుల్ ఇండియా కార్యక్రమం కింద భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ మద్దతుతో టెంపుల్ కనెక్ట్ ఇండియా ఆధ్వర్యంలో తిరుపతిలో ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ దేవాలయాల సమావేశం ఎక్స్‌పో (ఐటీసీఎక్స్ 2025) నిర్వహించనున్నట్టు టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకులు గిరేష్ కులకర్ణి చెప్పారు. ఫిబ్రవరి 17 వ తేదీ నుండి 19 వరకు జరగనుంది అన్నారు. ఈ ప్రత్యేకమైన జ్ఞాన భాగస్వామ్య కార్యక్రమం ఆలయ నిర్వహణలో ఉత్తమ పద్ధతులను గురించి చర్చిస్తుందన్నారు. నిపుణుల నేతృత్వంలోని చర్చలు, ప్రెజెంటేషన్‌లు, వర్క్‌షాప్‌లు మాస్టర్‌క్లాస్‌లు ఆలయ చర్చలు ఉంటాయన్నారు. ఈ సమావేశం 58కి పైగా దేశాల నుండి హిందూ మతం, సిక్కు మతం, బౌద్ధమతం జైన మతం యొక్క భక్తి సంస్థల నుండి కీలక ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న హైబ్రిడ్ భాగస్వామ్యం కలిగిన మూడు రోజుల స్మారక కార్యక్రమంలో 1581 కి పైగా ప్రతిష్ఠాత్మక దేవాలయాల నుండి ప్రముఖులు సమావేశమవుతారని చెప్పారు. ప్రగతిశీల భవిష్యత్తును రూపొందించడానికి, పరిపాలనను క్రమబద్ధీకరించడం, భక్తుల అనుభవాన్ని పెంచడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం ద్వారా ఆలయ పర్యావరణ వ్యవస్థలను మార్చడం ఐటీసీఎక్స్ 2025 లక్ష్యం అన్నారు.

దేవాలయాలు ప్రతినిధుల రిజిస్ట్రేషన్లు ప్రస్తుతం జనవరి 31 వరకు తెరిచి ఉంటాయని, రిజిస్ట్రేషన్లు ఉచితమని చెప్పారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర శాసనమండలి సభ్యులు, ఐటీసీఎక్స్2025 చైర్మన్ ప్రసాద్ లాడ్ సహ నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు.

ముగ్గుల పోటీల విజేత అరుణ

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు: సంక్రాంతి పండగల సందర్భంగా మండలం బాతుపురం - పెదవంక గ్రామంలో యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వజ్రపుకూతురు సబ్ ఇన్స్పెక్టర్ నిహార్ హాజరయ్యారు. ఈ ముగ్గుల పోటీల్లో 24 మంది మహిళలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి అరుణ, ద్వితీయ బహుమతి సుజాత, తృతీయ బహుమతి కీర్తన గెలుపొందారు. పోటాపోటీగా సాగిన సాంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో గీతిక కైవసం చేసుకున్నట్లు సంస్థ అధ్యక్షులు కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గులు పోటీల్లో పండగ వాతావరణం నెలకొందని అన్నారు. యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్,దుర్యోధన, మోహన్, శ్రీను, రవి, నవీన్, లోక్నాథం, సుధా, హరీష్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌పై జీవీఎంసీ కమిషనర్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర స్వచ్ఛత కోసం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ పేరున ఒక బృహత్తర కార్యక్రమాన్ని కడప జిల్లా మదుకూరులో జనవరి 18, 2025 తేదిన ప్రారంభోత్సవం చేస్తున్నారని, ఇదే కార్యక్రమాన్ని 2025 సంవత్సరం జనవరి నుండి డిసెంబరు వరకు ప్రతీ నెల 3వ శనివారం నాడు అన్ని జిల్లాలో జరపాలని కార్యాచరణ మార్గదర్శకాలను విడుదల చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కార్యచరణ మార్గదర్శకాలపై జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ జీవీఎంసీ ఉన్నతాధికారులు, జోనల్ కమీషనర్లతో జివిఎంసి చేపట్టవలసిన కార్యాచరణపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని, స్వచ్ఛ విశాఖ అభివృద్ధి దిశగా విశాఖ నగరం లో జీవీఎంసీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలానుగుణంగా ప్రజల ఆరోగ్యం కొరకు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ఇంటింట తడి పొడి చెత్త సేకరణ, వాయు కాలుష్య నియంత్రణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణ, పరిశుభ్రమైన తాగునీరు ప్రజలకు అందించడం, వచ్చదనం పెంపొందించడం, సేంద్రియ ఎరువు తయారీకి ప్రోత్సహించడం మొదలైన థీమ్ సంబంధిత కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలు 2025 జనవరి నుండి డిసెంబరు వరకు ప్రతి నెలలో 3వ శనివారం నాడు విశాఖ నగరం లో నిర్వహిచడం జరుగుతాయనన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యచరణ కార్యక్రమం జీవీఎంసీ 3వ జోన్ పరిధి శివాజీ పార్కులో జనవరి 18న 3వ శనివారం నాడు విశాఖ జిల్లా కలెక్టరు ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని కమీషనరు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద రాజు, ముఖ్య పట్టణ ప్రణాళికాధికారి ఎ.ప్రభాకరరావు, డిసిఆర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ డైరెక్టర్ యుసిడి పి.ఎమ్. సత్యవేణి, పర్యవేక్షక ఇంజనీర్లు, జోనల్ కమిషనర్లు, ఏఎమ్ఓహెచ్‌లు, కార్యనిర్వహక ఇంజనీర్లు, ఏపీడీలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఐకాన్ కిదాంబి శ్రీకాంత్‌తో హండ్రెడ్ స్పోర్ట్స్ భాగస్వామ్యం

- ఎలైట్ "క్లబ్ హండ్రెడ్" బృందంలో చేరిన శ్రీకాంత్ కిదాంబి

విశాలాంధ్ర /విశాఖపట్నం : అంతర్జాతీయ వేదికగా ప్రముఖ స్పోర్ట్స్ బ్రాండ్ గా ప్రసిద్ధి చెందిన హండ్రెడ్ స్పోర్ట్స్ వరల్డ్ బ్యాడ్మింటన్ లెజెండ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత, మాజీ ప్రపంచ నెంబర్ 1 పురుషుల సింగిల్స్ ఆటగాడు శ్రీకాంత్ కిదాంబి తో తమ భాగస్వామ్యాన్ని సగర్వంగా ప్రకటించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. భారత బ్యాడ్మింటన్ మార్కెట్లో తమ బ్రాండ్ ఉనికిని బలోపేతం చేయాలనే లక్ష్యంలో శ్రీకాంత్-హండ్రెడ్‌తో సంయుక్త సహకారం భాగస్వామ్యం కీలకమైన అడుగుగా మారనుందన్నారు.ఈ భాగస్వామ్యం ప్రతిష్ఠాత్మక ఇండోనేషియా మాస్టర్స్ 2025లో అధికారికంగా అరంగేట్రం చేస్తుందన్నారు. హండ్రెడ్ స్పోర్ట్స్ తో భాగస్వామ్యం, అనుబంధం గురించి శ్రీకాంత్ మాట్లాడుతూ "నా ప్రదర్శన పట్ల, నా క్రీడా ప్రయాణాన్ని ప్రతిధ్వనించగలిగే బ్రాండ్ అయిన హండ్రెడ్‌తో భాగస్వామ్యం కావడం చాలా ఆనందంగా ఉందన్నారు .

ఈ గొప్ప కలయికతో తదుపరి తరం బ్యాడ్మింటన్ ఆటగాళ్లను ప్రేరేపించడమే లక్ష్యంగా పెట్టుకున్నామ" తెలిపారు.హండ్రెడ్ సింగపూర్ డైరెక్టర్ మనక్ కపూర్ మాట్లాడుతూ.., "శ్రీకాంత్‌ను హండ్రెడ్ కుటుంబంలోకి స్వాగతించడం ప్రపంచవ్యాప్తంగా బ్యాడ్మింటన్ మూలాలను మరింత ముందుకు తీసుకెళ్లాలననే మా నిబద్ధతకు నిదర్శనమన్నారు. హండ్రెడ్ ఇండియా డైరెక్టర్ విశాల్ జైన్ మాట్లాడుతూ.., "గత దశాబ్ద కాలంలో భారతదేశంలో బ్యాడ్మింటన్ అద్భుతమైన వృద్ధిని సాధించిందన్నారు. ఈ క్రమంలో యువతరంలో రెండవ అత్యధికంగా ఆడే క్రీడగా మారిందన్నారు.

ఎన్సీఏపీ క్రాస్ టెస్టులో స్కోడా కైలాక్‌కి ఫైవ్ స్టార్ రేటింగ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్సీఏపీ)లో స్కోడా ఆటో ఇండియా మొదటి సబ్ 4 మీటర్ల ఎస్‌యువి కైలాక్, ప్రతిష్ఠాత్మకమైన 5 స్టార్ భద్రతా రేటింగ్‌ను సాధించిందని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా చెప్పారు. దీనితో భారత్ ఎన్సిఏపి పరీక్షలో పాల్గొన్న మొట్టమొదటి స్కోడా వాహనంగా కైలాక్ నిలచి, కుషాక్ మరియు స్లావియా నెలకొల్పిన భద్రతా శ్రేష్ఠత బ్రాండ్ వారసత్వాన్ని కొనసాగిస్తోందన్నారు. స్కోడా ఆటో ఇండియా 2.0 కార్లు రెండూ పెద్దలు, పిల్లల ప్రయాణికుల రక్షణ కోసం సంబంధిత గ్లోబల్ ఎన్సిఏపి క్రాష్ పరీక్షలలో 5-స్టార్ భద్రతా రేటింగ్‌లను సాధించాయన్నారు. భద్రత అనేది స్కోడా జన్యువుల్లో అంతర్లీనంగా ఉంటుందని, అదే విధంగా, 2008 నుంచి ప్రతి స్కోడా కారు ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో క్రాష్-టెస్టులను ఎదుర్కొని 5 స్టార్ భద్రతా రేటింగ్‌లను దక్కించుకుందన్నారు. స్కోడా ఆటో భారతదేశంలో కార్ల భద్రతపై 5-స్టార్ భద్రతా-రేటెడ్ కార్ల సముదాయంతో ప్రచారానికి నాయకత్వం వహిస్తోందని తెలిపారు.

20 నుంచి జీ తెలుగులో మంతెన సత్యనారాయణ రాజు ఆరోగ్యమే మహాయోగం

విశాలాంధ్ర / విశాఖపట్నం: ఈనెల 20వ తేదీ నుంచి ప్రముఖ ఆరోగ్య సలహాదారులు మంతెన సత్యనారాయణ రాజు అందించే ఆరోగ్యమే మహాయోగం కార్యక్రమం జీ తెలుగులో పునః ప్రారంభిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య సలహాలు, సూచనలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకునే సమగ్ర సమాచారం అందించే కార్యక్రమంగా పేర్కొన్నారు. 1278 ఎపిసోడ్‌తో సుదీర్ఘకాలంపాటు ప్రసారమైన ఆరోగ్యమే మహాయోగం అశేష ప్రేక్షకాదరణ అందుకుందన్నారు. మరింత సమగ్ర సమాచారం, సరికొత్త సందేహాలు, సలహాలతో ఆరోగ్యమే మహాయోగం కార్యక్రమం ఈనెల 20వ తేదీ నుంచి సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 8:30 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అన్నపూర్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించనుండగా ప్రముఖ ఆరోగ్య సలహాదారులు మంతెన సత్యనారాయణ రాజు ప్రేక్షకుల సమస్యలు, సందేహాలకు సరైన సలహాలు అందిస్తారన్నారు. సంపూర్ణ ఆరోగ్యకరమైన జీవితానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, శారీరక, మానసిక ఆరోగ్యానికి జీవన శైలిలో చేసుకోదగిన సూచనలు ఈ కార్యక్రమం ద్వారా పొందవచ్చన్నారు. జీ తెలుగు అందిస్తున్న ఆరోగ్యమే మహాయోగం కార్యక్రమాన్ని తప్పక చూడా లన్నారు.

వీఎంఆర్డీఏలో స్వచ్ఛ విశాఖ మెట్రోపాలిటన్ కమీషనర్ కెఎస్ విశ్వనాథన్

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఎంఆర్డీఏలో ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ - స్వచ్ఛ విశాఖ' కార్యక్రమాన్ని చేపడుతున్నామని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలను, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనవసరమైన కాగితాలను తొలగించాలని చెప్పారు. వీఎంఆర్డీఏ పార్కుల్లో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని అన్నారు. వీఎంఆర్డీఏ పరిధిలోని వాణిజ్య సముదాయాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని శతశాతం నిషేధించాలని, తప్పనిసరిగా క్లాత్ సంచులు లేదా కాగితపు సంచులను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. విధిగా పొడి చెత్త, తడి చెత్తలకు విడిగా విడిగా చెత్త బుట్టలను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగముగా శనివారం అనగా వీఎంఆర్డీఏ సెంట్రల్ పార్క్ వద్ద ఉదయం 10 గంటలకు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ - కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అనంతరం కార్యాలయంలో 11.30 గంటలకు వత్రిజ్ఞ ఉంటుందని తెలిపారు.

మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పనులు నెలాఖరుకు పూర్తి కావాలి

వీఎంఆర్డీఏ ఎంసీ కె.ఎస్.విశ్వనాథన్

విశాలాంధ్ర - విశాఖ: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూ.80 కోట్ల నిధుల వ్యయంతో సిరిపురం జంక్షన్‌లో చేపడుతున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను మెట్రోపాలిటన్ కమీషనర్ కె.ఎస్ విశ్వనాథన్ పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించి ఎక్కువ కార్మికులను నియమించి అన్ని పనులను ఎట్టి పరిస్థితుల్లో జనవరి నెలాఖరుకి పూర్తి చేసి ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను, గుత్తేదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ప్రతి సోమవారం పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ వి.భవానీ శంకర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం.బలరామరాజు, కార్యనిర్వహక ఇంజినీర్లు మధుసూదన్, రామరాజు గుత్తేదారు సంస్థ ప్రతినిధులు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి నైన్ కేజీ ఫ్రంట్ లోడ్ సామ్‌సంగ్ వాషింగ్ మెషిన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, ఈరోజు తమ సరికొత్త 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లను విడుదల చేసినట్లు ప్రకటించింది. సమర్థవంతమైన లాండ్రీ సొల్యూషన్స్‌లో కొత్త ప్రమాణాలను నిర్దేశించిన 12 కేజీ మోడళ్ల అద్భుతమైన విజయం తర్వాత, కొత్త 9 కేజీ వాషింగ్ మెషీన్ల శ్రేణి అదే శక్తివంతమైన పనితీరు మరియు అధునాతన లక్షణాలను మరింత కాంపాక్ట్ పరిమాణంలో అందిస్తుందని సామ్‌సంగ్ ఇండియా డిజిటల్ ఉపకరణాల సీనియర్ డైరెక్టర్ ఘుఫ్రాన్ ఆలం అన్నారు. తాజా 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్లు పెద్ద లోడ్‌లను నిర్వహించడానికి సరైన పరిమాణంలో ఉన్నాయని, బట్టలు, బెడ్‌షీట్లు మరియు తువ్వాళ్లు వంటి రోజువారీ లాండ్రీకి సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తాయన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

విశాలాంధ్ర - మల్కాపురం: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకొని పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం పరిధి 59వ వార్డు కొత్తనక్కవానిపాలెం విఐసిఎల్‌యు కార్యాలయం యూనియన్ వ్యవస్థాపకులు దేవర అప్పలరాజు శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జనవరి 19 -23 వరకు కేరళ ఆయుర్వేదం శిబిరం

విశాలాంధ్ర- విశాఖ సిటీ: దీర్ఘకాల రోగాలకు ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా చికిత్స అందించేందుకు జనవరి 19 -23 వరకు కేరళకు చెందిన ప్రసిద్ధ వైద్యులచే ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కే యం ఉన్నికృష్ణన్ ఐదు రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. హైపర్ టెన్షన్ (ఆందోళన) , ఆర్థరైటీస్ (కీళ్ళ వ్యాధులు), పక్షవాతం, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక వత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అపాయింట్మెంట్ సంప్రదించాలనుకే వారు రామ్ నగర్ జివిఎంసి గేటు ఎదురు లైన్ లో గల తమ కేంద్రంలో సంప్రదించవచ్చునన్నారు. అపాయింట్మెంట్ కొరకు 9133106060 / 9030568264 నెంబర్ లో సంప్రదించాల్సిందిగా కోరారు.



ఎమ్మార్పీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - శ్రీకాకుళం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో ఆహార ప్రాసెసింగ్ రంగం (పి.యం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్)లో ఉద్యోగాల భర్తీకి సీడాప్ ద్వారా శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్‌గా పని చేయడానికి మొత్తం 30 ఉద్యోగాలకు గాను అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరారు. ప్రోత్సాహకాల (ఇన్సెంటివ్) ఆధారంగా వేతనం ఉంటుందని, ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్, ఆహార ప్రాసెసింగ్ లేదా సహజ వనరుల అభివృద్ధి రంగంలో అనుభవం ఉంటే ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. నవంబర్ 1, 2024 నాటికి 21-30 సంవత్సరాలు వయసు ఉన్నవారు అర్హులని, జనవరి 20 తేదీలోగా నిర్ణయించామని, రాత పరీక్ష జనవరి 24న ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ ఫోటోలతో కలిపి జనవరి 20, 2025 లోపు డిఆర్‌డిఎ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, లేదు అలాగే పైన చూపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం 7989744612, 9912557054కు సంప్రదించాలని కోరారు.

విశాఖ ఉక్కు ప్యాకేజీ ప్రకటన పట్ల సంబరాలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజి పట్ల టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టిడిపి నాయకులు కేంద్ర ప్రభుత్వా నికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్, ఎన్టీఆర్ వైద్యశాల చైర్మన్ సీతంరాజు సుధాకర్ మాట్లాడతూ విశాఖ స్టీల్ ప్లాంట్ విషయ ంలో సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ఫలించి విశాఖ ఉక్కు పరిశ్రమకు రివైవల్ ప్యాకేజీ కింద కేంద్ర ప్రభుత్వం 11,500 కోట్లు ప్రకటించిందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ పరిరక్షణపై కనీసం దృష్టి పెట్టలేదని విమర్శించారు. జగన్ సొంత ప్రయోజనాలు కోసం కేంద్రంతో సంప్రదింపులు జరిపారు తప్ప ఒక్కసారి స్టీల్ ప్లాంట్ కోసం మాట్లాడలేదన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రజలకు మేలు చేసే ఒక్క పని చేయలేదన్నారు. నాకు ఎంత మీకు ఎంత అన్నచందంగా గత ఐదు సంవత్సరాలు వైసిపి ప్రభుత్వం పాలన సాగింది అని ఎద్దేవా చేశారు. సైకో పాలన నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడిప్పుడే తెరుకుంటుంది అని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాం ట్‌కు ప్యాకేజీని ప్రకటించిన కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, ఉరుకుటి నారాయణరావు, వార్డు అధ్యక్షులు బంటుపల్లి సూర్యనారాయణ, ఉరుకుటి గణేష్, ఐతా మధు, కోరాడ చిన్న, బంగారు రవి శంకర్, సారిపల్లి మహేష్, గణపతి, ముక్కి రామకృష్ణ, షేక్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జనవరి 26న పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించే నిమిత్తం పోలీస్, రెవెన్యూ, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో పలు అంశాలపై ఆయన దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిబింబిస్తూ శకటాలను తీర్చిదిద్దాలని, స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియపరిచేలా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలని చెప్పారు. మైదానం సిద్ధం చేయాలని, అక్కడ అలంకరణ ఏర్పాట్లు చేయాలని, వీఐపీ, వీవీఐపీలు కూర్చునేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాట్లు, సాధారణ పౌరులు వేడుకలను వీక్షించేందుకు అనువుగా గ్యాలరీలను ఏర్పాటు చేయాలని జేసీ సూచించారు. ప్రభుత్వ శాఖల పరిధిలో చేపట్టిన పనులు, అమలు చేసిన పథకాలు, ఇతర ప్రగతి అంశాలను పేర్కొంటూ నివేదికలను సంబంధిత అధికారులకు సమర్పించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో భాగంగా ఎవరెవరు ఏయే బాధ్యతలు నిర్వర్తించాలో స్పష్టంగా తెలుపుతూ జేసీ దిశానిర్దేశం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, పోలీస్, రెవెన్యూ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 08 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి 08 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి కమీషనరు డా.పి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరంలో సిపిలు, డీసీపీలు, ఏసీపీలుతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/వినతులను స్వీకరించేందుకు గానూ ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, చీఫ్ సిటీ ప్లానరు అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి జివిఎంసి కి సంబంధించి 08 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 02, 3వ జోన్ కు 03, 4వ జోన్ కు 01, 6వ జోన్ కు 02 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదుచేసుకోవచ్చునన్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

రాజీనామా నిర్ణయానికి సార్థకత

స్టీల్‌ప్లాంట్ పరిశ్రమ కాదు.. తెలుగువారి ఆత్మ గౌరవం
పునరుజ్జీవ ప్యాకేజీపై భీమిలి ఎమ్మెల్యే గంటా హర్షం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవానికి కేంద్రం రూ.11,500 కోట్ల ప్యాకేజీ ప్రకటించడంతో తన రాజీనామా నిర్ణయానికి సార్థకత లభించిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎం.వి.పి. కాలనీలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తెలుగు వారెవరూ ఒక పరిశ్రమగా చూడరని, ఆంధ్రుల ఆత్మ గౌరవానికి అది ప్రతీకని పేర్కొన్నారు. విశాఖ నార్త్ నుంచి ప్రాతినిధ్యం వహించినప్పుడు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనకు నిరసనగా 2021 ఫిబ్రవరి 12న స్పీకర్ ఫార్మెట్‌లో తాను రాజీనామా చేశానని గుర్తు చేశారు. తన రాజీనామా అప్పట్లో కార్మిక లోకానికి నైతిక స్థైర్యాన్ని ఇచ్చిందన్నారు. 32 మంది ప్రాణ త్యాగంతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్ ను కేంద్రం మద్దతుతో కాపాడుకుని శాశ్వతంగా లాభాల బాటలోకి తీసుకు వెళ్లాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. పాతికేళ్ల క్రితం కేంద్రం ప్రైవేటీకరణ ఆలోచన చేసినప్పుడు దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు ఆధ్వర్యంలో 29 మంది లోకసభ, 14 మంది రాజ్యసభ టీడీపీ సభ్యుల బృందాన్ని ప్రధాని వాజేపేయి దగ్గరకు పంపించి ఆ ప్రతిపాదన విరమించుకునేలా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే ఇప్పుడూ ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడి భారీ ప్యాకేజీని ప్రకటించేలా చేశారని ప్రశంసించారు. స్టీల్ ప్లాంట్ సహా దాని అనుబంధ సంస్థల ఏర్పాటు కారణంగా వేలాది మందికి ఉపాధి లభించి, విశాఖ ముఖచిత్రమే మారిపోయిందన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు దన్నుగా కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విజయనగరం జిల్లా గర్భాం మాంగనీస్ గనుల లీజును విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మరో 10 ఏళ్లు పెంచామని చెప్పారు. 4,200 మంది కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలను నిలబెట్టామని, రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లను వినియోగంలోకి తీసుకు వచ్చామని తెలియజేశారు. ప్రైవేటీకరణ ప్రతిపాదన రాగానే అప్రమత్తమై పోరాటాన్ని సాగించిన కార్మిక, ఉద్యోగ సంఘాలకు గంటా అభినందనలు తెలిపారు.

పాలనను పోల్చి చూడండి

రాష్ట్రానికి అనుకూలంగా కొత్త ఏడాదిలో అన్నీ శుభవార్తలు వెలువడుతు న్నాయని ఆయన సంతోషం వ్యక్తపరిచారు. ఈనెల 8న ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.2.10 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి విశాఖ అంటే ప్రత్యేక అభిమానమన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.13 లక్షల కోట్ల అప్పులు మిగిల్చినప్పటికీ ప్రతి నెల 1 వ తేదీన క్రమం తప్పకుండా పెన్షన్లు, ఉద్యోగులు జీతాలు ఇస్తున్నామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా మెగా డీఎస్సీతో 16,347 పోస్టులు భర్తీ చేస్తున్నామని, రూ.5 కే భోజనం పెట్టే అన్న క్యాంటీన్లు ప్రారంభించామని తెలిపారు. దీపం -2 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, తల్లికి వందనం, రైతు భరోసా పథకాలకు విధివిధానాలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. రూ.7,200 కోట్లతో గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు వంటి అభివృద్ధి పనులను పెద్దఎత్తున చేపట్టామన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనను ఏడు నెలల కూటమి పరిపాలనతో పోల్చి చూడాలని రాష్ట్ర ప్రజానీకాన్ని కోరారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.వి.నరసింహం, లొడగల అప్పారావు, భీమిలి జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కూటమి నాయకులు కె.రామానాయుడు, శాఖారి శ్రీనివాస్, డి.ఎ.ఎన్.రాజు, కోరాడ రమణ, దామోదరరావు, గంటా నూకరాజు, బి.ఆర్.బి.నాయుడు, తాత్రాజు అప్పారావు, మొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.